తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
28 ఏప్రిల్ 2026
సంపుటి 03
సంచిక 200
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



### మహిళలు, పిల్లల భద్రతకు


## 'స్పందన' బృందాలు

- సీఎం రేవంత్ రెడ్డి
- తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రారంభం
- 24 గంటలు పనిచేసే తక్షణ రక్షణ వ్యవస్థ
- డ్రగ్స్ నియంత్రణ, సమాజ భాగస్వామ్యంపై దృష్టి

హైదరాబాద్, ఏప్రిల్ 27 తరంగాలు ప్రతినిధి మహిళలు, పిల్లల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మహిళల భద్రత కోసం ఇప్పటికే అమలు చేస్తున్న షీ టీమ్స్, స్టాండ్ విత్ హర్ కార్యక్రమాల సరసన కొత్తగా 'స్పందన' తక్షణ రక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి స్పందన వాహనాలకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నగర పోలీసు అధికారులు, పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మహిళ తన కాళ్ల

➤ మిగతా 2వ పేజిలో..

# పనిఒత్తిడి ప్రాణాంతకం



- ప్రపంచవ్యాప్తంగా లక్షల్లో ఉద్యోగుల మరణాలు
- మానసిక ఆందోళనలతో గుండెపోటులు, ఆత్మహత్యలు
- సుస్థిర పనివాతావరణం అత్యవసరం

డెస్క్, ఏప్రిల్ 27తరంగాలు ప్రతినిధి ప్రపంచవ్యాప్తంగా ఆధునిక ఉద్యోగ వ్యవస్థలు ఎంత వేగంగా మారుతున్నాయో, అదే స్థాయిలో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెరుగుతోంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదికలో వెల్లడించిన వివరాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. అధిక పనిగంటలు, ఉద్యోగ భద్రతపై అనిశ్చితి, పనిస్థల వేధింపులు వంటి కారణాలతో ప్రతి సంవత్సరం సుమారు 8.40 లక్షల మంది ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారని ఈ నివేదిక పేర్కొంది. సుదీర్ఘ పనిగంటలు ఉద్యోగుల శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, మానసిక స్థితినీ తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. పనిలో నియంత్రణ లేకుండా అధిక బాధ్యతలు, డిమాండ్లు పెరగడం వల్ల ఉద్యోగులు నిరంతర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడి దీర్ఘకాలంలో గుండె సంబంధిత వ్యాధులు, నిద్రలేమి, డిప్రెషన్ వంటి సమస్యలకు దారితీస్తోంది. పరిస్థితి మరింత తీవ్రమై కొందరు ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు కూడా పెరుగుతున్నాయని నివేదిక స్పష్టం చేసింది.

ఉద్యోగ సంబంధిత మానసిక సమస్యలు కేవలం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే ప్రభావితం చేయడం కాదు, సమాజం, ఆర్థిక వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. ప్రతి సంవత్సరం సుమారు 4.5 కోట్ల పని సంవత్సరాలు ఈ సమస్యల కారణంగా వృథా అవుతున్నాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉత్పాదకతను తగ్గించడమే కాకుండా, సంస్థల పనితీరును కూడా దెబ్బతీస్తోంది. ఆర్థిక పరంగా ఈ నష్టం చాలా పెద్దది. ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 1.37 శాతం వరకు ఈ మానసిక ఒత్తిడి కారణంగా నష్టం వాటిల్లుతోందని నివేదిక వెల్లడించింది. దీని వల్ల ప్రభుత్వాలు, సంస్థలు భారీ ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది. ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరగడం, ఉద్యోగుల గైర్హాజరు పెరగడం వంటి సమస్యలు మరింత భారాన్ని పెంచుతున్నాయి.

ఈ అధ్యయనానికి నేతృత్వం వహించిన ఐఎల్ఓ అధికారి మానల్ అజ్జీ మాట్లాడుతూ, ఆధునిక పని పరిస్థితుల్లో మానసిక, సామాజికపరమైన ఒత్తిడులు అత్యంత కీలక సవాళ్లుగా మారాయని తెలిపారు. ఉద్యోగుల భద్రత, ఆరోగ్య పరిరక్షణను సంస్థలు ప్రాధాన్యంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని, పని ప్రదేశాల్లో సానుకూల వాతావరణం లేకపోతే దీర్ఘకాలంలో తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడేందుకు సమగ్ర విధానాలు అవసరం. సరైన పనిగంటలు, విశ్రాంతి సమయం, మానసిక ఆరోగ్యానికి మద్దతు, వేధింపులపై కఠిన చర్యలు వంటి అంశాలను సంస్థలు

➤ మిగతా 2వ పేజిలో..



# కాంగ్రెస్ విజయమే లక్ష్యం

- మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు
- రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలనే ఆకాంక్ష
- బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి
- ఓట్ల తొలగింపు కుట్రను అడ్డుకోవాలని పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 27తరంగాలు ప్రతినిధి రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చూడడమే ప్రతి కార్యకర్త ధ్యేయంగా పెట్టుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. బీజేపీ కుటిల

➤ మిగతా 2వ పేజిలో..

# ఆప్‌కు భారీ దెబ్బ

- ఏడుగురు ఎంపీల విలీనానికి ఆమోదం
- రాజ్యసభలో బీజేపీ బలం పెరుగుదల
- మెజారిటీకి చేరువలో ఎన్డీఏ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 తరంగాలు ప్రతినిధి అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమైన ప్రక్రియకు రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం ఆమోదం తెలిపారు. దీంతో రాజ్యసభలో ఆప్ బలం గణనీయంగా తగ్గిపోయింది.

రాజ్యసభ అధికారిక గణాంకాల ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న సభ్యుల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇదే సమయంలో బీజేపీ సభ్యుల సంఖ్య 106 నుంచి 113కు పెరిగింది. ఇక ఎన్డీఏ కూటమి మొత్తం బలం 141 నుంచి 148కు చేరింది. మెజారిటీ మార్క్ అయిన 123కు బీజేపీ మరింత దగ్గరైంది. బీజేపీలో చేరిన ఎంపీలు సమర్పించిన విలీన లేఖపై చైర్మన్ న్యాయపరమైన అభిప్రాయం తీసుకున్నట్లు సమాచారం. ఆ లేఖపై ఏడుగురు ఎంపీలు సంతకాలు చేశారు. ఆప్ రాజ్యసభ సభ్యుల్లో రెండు మూడవ వంతు మెజారిటీ ఈ నిర్ణయానికి మద్దతు ఇవ్వడంతో విలీనానికి న్యాయపరంగా అడ్డంకులు లేకుండా పోయాయి. బీజేపీలో చేరిన ఎంపీలలో రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తా

➤ మిగతా 2వ పేజిలో..



# ప్రజా సమస్యలపై పోరాడేవారికే టికెట్లు

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం
- సభ్యత్వ నమోదు లక్ష్యాలు చేరుకోకపోతే చర్యలు హెచ్చరిక
- రైతుల పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- పార్టీ కమిటీల రద్దు -- పునర్వ్యవస్థీకరణకు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 27 తరంగాలు ప్రతినిధి : ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడే నాయకులకే వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లక్ష్యాలకు అనుగుణంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లక్ష్యాలు చేరుకోలేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని పండిన

➤ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ కోసం మరోసారి పోరాటం: కేటీఆర్ పిలుపు



- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సందేశం
- ఉద్యమం నుంచి అధికారానికి ప్రయాణం గుర్తు
- రాష్ట్ర రక్షణకు పునరంకితం కావాలని పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 27తరంగాలు ప్రతినిధి బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కీలక సందేశం ఇచ్చారు. ఉద్యమ పార్టీగా ఢిల్లీ మెడలు వంచించి తెలంగాణ సాధించిన కీర్తి తమదేనని, అధికారంలో పదేళ్లపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన ఘనత కూడా తమదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్షంగా

➤ మిగతా 2వ పేజిలో..

# ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణ స్వీకారం



- గవర్నర్ కోటాలో నామినేషన్ ద్వారా కీలక మార్పులు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కార్యక్రమం



- రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న వేడుక

హైదరాబాద్, ఏప్రిల్ 27 తరంగాలు ప్రతినిధి తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యత కలిగిన పరిణామంగా మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ కోదండరాం శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ అయిన వీరికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తన చాంబర్‌లో అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి

➤ మిగతా 2వ పేజిలో..



## భారత్--న్యూజిలాండ్ ఉచిత వాణిజ్య ఒప్పందం

- మహిళల ఆధ్వర్యంలో తొలి ఎఫ్‌టీఏగా గుర్తింపు
- భారత ఎగుమతులకు 100 శాతం సుంక రహిత ప్రవేశం
- పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలకు కొత్త దారి

➤ మిగతా 2వ పేజిలో..

## మహిళలు, పిల్లల భద్రతకు
# 'స్పందన' బృందాలు

➢ మొదటి పేజీ తరువాయి

మీద తాను నిలబడాలంటే భద్రత అత్యంత అవసరమని అన్నారు. మహిళలు చదువు, వ్యాపారం స్వేచ్ఛగా కొనసాగించగలిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.మహిళలపై వేధింపులను పూర్తిగా అరికట్టాలని సూచిస్తూ, స్వచ్ఛంధ సంస్థలు, పీస్ కమిటీలు కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. సమాజంలో వివక్షకు గురయ్యే మహిళలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. స్పందన బృందాలు బాధితుల వద్దకు వెంటనే చేరుకుని మొదట మానసిక ధైర్యాన్ని కల్పించి, అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటాయని తెలిపారు. మహిళల గౌరవాన్ని కాపాడటంలో ప్రభుత్వం, సమాజం కలిసి నిలబడుతాయన్న నమ్మకం కల్పించాలన్నారు.మహిళలపై నేరాలకు కారణంగా మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోందని పేర్కొంటూ, డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ దిశగా ఈగిల్ తెలంగాణ ఫోర్స్ ద్వారా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. డ్రగ్స్ బారిన పడిన వారి కోసం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

మహిళల ఆర్థిక స్వావలంబన రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొంటూ, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలు, ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల సాధికారతే రాష్ట్ర ఆర్థిక పురోగతికి పునాది అని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ విజయమే లక్ష్యం

యత్నాల్లో భాగంగా తెలంగాణలో సెక్యులర్ ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అడ్డదారుల్లో ఓట్లను తొలగించే చర్యలను అడ్డుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం, పనితీరుపై ఎలాంటి రాజీ పడకూడదని ఆయన స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి బీఎల్ఏల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి బూత్ వద్ద పార్టీ బలాన్ని పెంచేందుకు ప్రత్యేక వ్యూహాలతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రజాపాలన సాగుతోందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని అనేక సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు.

రాష్ట్రానికి రూ. 5 లక్షల కోట్ల పెట్టుబడులు రావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇది సాధారణ విషయం కాదని, పెట్టుబడిదారులు తెలంగాణపై నమ్మకం ఉంచుతున్నారనే విషయాన్ని ఇది స్పష్టం చేస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 2023 ఫలితాలను మళ్లీ పునరావృతం చేయాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. త్వరలో కార్పొరేషన్ పదవుల భర్తీ జరుగుతుందని తెలిపారు. నాయకులు తమ సమయంలో ఎక్కువ భాగాన్ని పార్టీ బలోపేతానికి కేటాయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠంగా ఉంటేనే భవిష్యత్తులో విజయాలు సాధ్యమవుతాయని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## తెలంగాణ కోసం మరోసారి పోరాటం: కేటీఆర్ పిలుపు

కోట్లాది ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ స్వీయ రాజకీయ అస్థిత్వానికి ప్రతీకగా గులాబీ జెండా నిలుస్తుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలతో విడదీయలేని బంధాన్ని ఈ జెండా సూచిస్తుందని చెప్పారు. క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిస్వార్థంగా పనిచేస్తున్న పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో సాగిన రెండున్నర దశాబ్దాల ప్రయాణం చారిత్రాత్మకమని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి పోరాటం, ప్రతి మలుపు తెలంగాణ చరిత్రలో చెరగని గుర్తుగా నిలిచిందన్నారు. త్యాగాలు, బలిదానాలతో సాధించిన తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదేనని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్, తెలంగాణ విధ్వంసం దిశగా వెళ్తోందని విమర్శించారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మరోసారి ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం తిరిగి పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు.

తెలంగాణ రక్షణ కోసం మరోసారి తెగించి పోరాడాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. ప్రజల ఆశయాలను కాపాడే బాధ్యత పార్టీపై ఉందని, అందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు పునరంకితం కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## ప్రజా సమస్యలపై
# పోరాడేవారికే టికెట్లు

➢ మొదటి పేజీ తరువాయి

ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించడంలో విఫలమైందని ఆరోపించారు.తెలంగాణపై వ్యాఖ్యలు చేసిన తేజస్వీ సూర్యపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కాంగ్రెస్, బీజేపీ నేతలు స్పందించకపోవడాన్ని తప్పుపట్టారు. తమ పార్టీ ఎంపీలు ఉంటే పార్లమెంట్‌లో తీవ్రంగా ప్రతిస్పందించేవారమని పేర్కొన్నారు.

హైదరాబాద్ అంశంపై గతంలో ఒత్తిళ్లు వచ్చినప్పటికీ రాజీపడలేదని ఆయన గుర్తుచేశారు. పార్టీ ఓటమిపై ఆత్మపరిశీలన అవసరమని, సభ్యత్వం ఎక్కువగా ఉండటం కంటే నాణ్యత ముఖ్యమని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో పార్టీ ఓటమిపై విచారం వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ నాయకులపై అక్రమాలు, భూకబ్జాల ఆరోపణలు చేశారు. ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్ర కమిటీ మినహా మిగతా అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో సభ్యత్వ నమోదు చేపడతామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సభ్యత్వ రుసుమును సాధారణ సభ్యత్వానికి రూ. 10, క్రియాశీల సభ్యత్వానికి రూ. 50గా నిర్ణయించారు. రైతుల పంటల కొనుగోలు, మహిళా రిజర్వేషన్ల అమలుపై పార్టీ తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. రైతులకు అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణ స్వీకారం

ఎ. రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై కొత్త సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో పాల్గొనడం ద్వారా ప్రభుత్వం ఈ నియామకాలకు ఇచ్చిన ప్రాధాన్యత స్పష్టమైంది. గవర్నర్ కోటాలో జరిగిన ఈ నియామకాలు శాసనమండలి రాజకీయ సమీకరణాల్లో కీలక మార్పులకు దారితీసే అవకాశముందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.ఈ సందర్భంగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి పాల్గొని కొత్త ఎమ్మెల్సీలకు అభినందనలు తెలిపారు. అలాగే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇతర ప్రజాప్రతినిధుల్లో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్‌లు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా హాజరై అభినందనలు తెలిపారు. ఈ వేడుక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రమాణ స్వీకారం అనంతరం అజారుద్దీన్, కోదండరాం తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని, శాసనమండలిలో ప్రజల వాణిగా నిలుస్తామని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి అంశాలపై మరింతగా పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు  ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచింది. గవర్నర్ కోటాలో జరిగిన ఈ నియామకాలు ప్రభుత్వానికి శాసనమండలిలో మరింత బలం చేకూర్చే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. భవిష్యత్తులో విధానాల అమలు, చర్చల్లో ఈ సభ్యుల పాత్ర కీలకంగా ఉండబోతోందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## ఆప్‌కు భారీ దెబ్బ

➢ మొదటి పేజీ తరువాయి

ఉన్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ నిబంధనలకు అనుగుణంగా ఈ విలీనం జరిగిందని చైర్మన్ భావించినట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం రెండు మూడవ వంతు సభ్యుల మద్దతు ఉంటే విలీనాన్ని ఆమోదించవచ్చు. దీంతో ఈ ప్రక్రియకు పూర్తి చట్టబద్ధత లభించినట్లైంది.మరోవైపు ఈ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ ముందుగా రాజ్యసభ చైర్మన్‌ను కోరింది. అయితే తాజా పరిణామాలతో ఆ పార్టీకి రాజకీయంగా భారీ దెబ్బ తగిలినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## పనిఒత్తిడి ప్రాణాంతకం

➢ మొదటి పేజీ తరువాయి

అమలు చేయాలి. సానుకూల, భద్రమైన పని వాతావరణం ఏర్పడితేనే ఉత్పాదకత పెరుగుతుంది, ఉద్యోగుల సంతృప్తి మెరుగవుతుంది, దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది.

## భారత్--న్యూజిలాండ్ ఉచిత వాణిజ్య ఒప్పందం..

- మహిళల ఆధ్వర్యంలో తొలి ఎఫ్‌టీఏగా గుర్తింపు
- భారత ఎగుమతులకు 100 శాతం సుంక రహిత ప్రవేశం
- పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలకు కొత్త దారి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 భారత్--న్యూజిలాండ్ మధ్య కీలక ఆర్థిక ఒప్పందానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఇరు దేశాలు ఉచిత వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇది మహిళల ఆధ్వర్యంలో కుదిరిన తొలి ఎఫ్‌టీఏగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ ఒప్పందం నరేంద్ర మోదీ, క్రిస్ లక్సన్ నాయకత్వంలో అమలులోకి వచ్చింది. కేవలం తొమ్మిది నెలల కాలంలోనే చర్చలు పూర్తి కావడం విశేషంగా నిలిచింది. ఈ ప్రక్రియలో న్యూజిలాండ్ వాణిజ్య మంత్రి టాడ్ మెక్లే సహా ఇరు దేశాల ప్రతినిధులు కీలక పాత్ర పోషించారు.ఈ ఒప్పందం ద్వారా భారత ఎగుమతులకు న్యూజిలాండ్ మార్కెట్లో 100 శాతం సుంక రహిత ప్రవేశం లభించనుంది. చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, రైతులు, మహిళలు, యువత, నిపుణులకు ఇది భారీ అవకాశాలను అందించనుంది. ఉపాధి సృష్టి, వ్యాపార విస్తరణకు ఇది దోహదపడుతుందని కేంద్రం భావిస్తోంది. అదేవిధంగా ఈ ఒప్పందం ద్వారా భారత్‌లోకి సుమారు 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వాణిజ్యం, సేవలు, ఆవిష్కరణలు, వ్యవసాయ ఉత్పాదకత, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కానుంది.నైపుణ్య అభివృద్ధి, విద్యార్థుల అవకాశాలు, నిపుణుల మార్పిడి వంటి అంశాల్లో కూడా ఈ ఒప్పందం కీలక మార్పులకు దారితీయనుంది. సమతుల్య విధానాలతో భారత ప్రయోజనాలను కాపాడుతూ ఒప్పందం రూపొందించబడిందని అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ ఒప్పందం భారత్--న్యూజిలాండ్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు సమగ్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అభివృద్ధి భారత్ లక్ష్య సాధనలో ఇది మరో కీలక అడుగుగా నిలవనుంది.

## తెలంగాణ తల్లికి కేసీఆర్ నివాళులు

- బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా
- తెలంగాణ భవన్‌లో రజతోత్సవ ముగింపు కార్యక్రమం
- కేసీఆర్‌కు ఘన స్వాగతం
- తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులు



హైదరాబాద్, ఏప్రిల్ 27 హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రజతోత్సవ ముగింపు వేడుకల్లో పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వేడుకల సందర్భంగా తెలంగాణ ఉద్యమ ప్రయాణాన్ని నేతలు స్మరించుకున్నారు. పార్టీ స్థాపన నుంచి రాష్ట్ర సాధన వరకు జరిగిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ అభివృద్ధిలో పార్టీ పోషించిన పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు.అనంతరం తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి కేసీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరులను స్మరించుకున్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా తెలంగాణ తల్లి నిలుస్తుందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవన్ రెడ్డి, మధుసూదన చారి, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వారు కూడా తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ వేడుకలు పార్టీ ఐక్యత, శక్తిని ప్రతిబింబించాయి. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

## అనేక వర్సిటీలకు ఆంధ్రా దిక్సూచి

- వర్సిటీలు మన చారిత్రక సంపద
- శతాబ్ది ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

విశాఖపట్నం,ఏప్రిల్27 దేశంలోని అనేక యూనివర్సిటీ లకు ఆంధ్రా యూనివర్సిటీనే దిక్సూచి అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. సోమవారం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్‌లో శతాబ్ది మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ మహోత్సవాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఏయూ.. దేశంలోనే టాప్-5 యూనివర్సిటీల్లో ఒకటిగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఏయూకు రూ. 500 కోట్ల నిధులు ఇస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. మరో రూ. 500 కోట్లు కార్పస్ అభివృద్ధి కావాలని పేర్కొన్నారు. వర్సిటీలు మన చారిత్రక సంపద అని అభివర్ణించారు. వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏయూలో రూ. 64 కోట్ల పనులు ప్రారంభించామని సీఎం చంద్రబాబు వివరించారు. సాధారణ వ్యక్తి.. అసాధారణ శక్తిగా మారాలని విద్యార్థులకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. విశాఖపట్నంకు గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం ఇకనుంచి గ్లోబల్ సిటీ.. ఇక అన్‌స్టాపబుల్ అని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ యూనివర్సిటీ స్థాపించేందుకు అనేక మంది కృషి చేశారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. తొలి వీసీ కట్టమంచి రామలింగారెడ్డి ఈ యూనివర్సిటీకి బలమైన పునాదులు వేశారని చెప్పారు. రెండో వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్.. దేశ రాష్ట్రపతిగా ఎదిగారని గుర్తు చేశారు. ఈ యూనివర్సిటీలో 58 దేశాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారని సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. రాష్ట్రంలో ఏయూని స్థాపించేందుకు అనేక మంది కృషి చేశారని సీఎం చంద్రబాబు అన్నారు. తొలి వీసీ కట్టమంచి ఈ విశ్వవిద్యాలయానికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. ఏయూలో వందేళ్ల పండగ జరుగుతోంది. తెలుగు వైభవానికి కూడా ఏయూ కృషి చేస్తోంది. ఈ విశ్వవిద్యాలయంలో 58 దేశాల విద్యార్థులు చదువుతున్నారు. విశాఖ ఇకనుంచి గ్లోబల్‌సిటీ.. దీని అభివృద్ధి అన్‌స్టాపబుల్. దేశంలోని అనేక యూనివర్సిటీలకు ఏయూనే దిక్సూచి. వర్సిటీలు మన చారిత్రక సంపద.. వాటిని కాపాడుకోవాలి.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**తెలంగాణ భవన్‌లో జెండా ఆవిష్కరణతో ప్రారంభం**

**కేటీఆర్ నేతృత్వంలో ఐక్యత ప్రదర్శన**

**పార్టీ బలోపేతానికి నేతల సంకల్పం**

హైదరాబాద్, ఏప్రిల్ 27  బీఆర్ఎస్ పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పార్టీ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ స్థాపన నుంచి ఇప్పటివరకు సాగిన రాజకీయ ప్రయాణాన్ని నేతలు స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పార్టీ పోషించిన పాత్రను విశేషంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలపై నాయకులు విశ్లేషణాత్మకంగా మాట్లాడారు. తెలంగాణ కోసం జరిగిన ఉద్యమం నుంచి అధికారంలోకి వచ్చిన దశ వరకు పార్టీ తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన కార్యక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. ప్రజల ఆశయాలను నెరవేర్చడంలో పార్టీ నిరంతరం కృషి చేస్తోందని నేతలు తెలిపారు.

ఈ వేడుకలకు మండలి ప్రతిపక్ష నేత మధుసూదనా



చారి హాజరయ్యారు. అలాగే మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీకి చెందిన కీలక నాయకులు, కార్యకర్తలు సమూహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నేతలు కార్యకర్తల కృషిని ప్రత్యేకంగా కొనియాడారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసిన కార్యకర్తల పాత్రను గుర్తించారు. పార్టీ భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు కార్యకర్తలు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యత, క్రమశిక్షణతో ముందుకు సాగితే పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు.

తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం పార్టీ ప్రధాన లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీ ముందుండి పనిచేస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ ఐక్యత, శక్తిని ప్రతిబింబించాయి. కార్యక్రమం ద్వారా కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపబడింది. భవిష్యత్తులో పార్టీ మరింత బలోపేతం అవుతూ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతుందనే నమ్మకాన్ని నాయకులు వ్యక్తం చేశారు.

## గోవు (ఆవు)ను జాతీయ జంతువుగా ప్రకటించాలి

• తహసిల్దార్‌కు మెమోరాండం అందజేసిన గో రక్షకులు



**వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 27,తరంగాలు :**
గోవు(ఆవు)ను జాతీయ జంతువుగా ప్రకటించాలని వర్ధన్నపేట తహసిల్దార్ కు గో రక్షకులు మెమోరాండం అందజేశారు.వర్ధన్నపేట మండలం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ విజయ్ సాగర్ ను బీజేపీ నాయకులు కలిసి దేశంలో గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కోరుతూ ఇట్టి ప్రతులను జిల్లా కలెక్టర్ ద్వారా భారత దేశ రాష్ట్రపతి, ప్రధాన మంత్రి,రాష్ట్ర గవర్నర్,తెలంగాణ ముఖ్యమంత్రి లకు చేర్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో బృందావన గోసేవ నిర్వహకులు మల్లెపాక అనిల్ , బీజేపీ జిల్లా కార్యదర్శి రాయపురం కుమారస్వామి, సీనియర్ నాయకులు కొండేటి సత్యం,వర్ధన్నపేట బిజెల్ మండల అధ్యక్షుడు అడుప రాజు,బీజేవైఎం మండల అధ్యక్షుడు పెండోట పవన్(మహంత్), వర్ధన్నపేట శక్తి కేంద్రం ఇంచార్జ్ మైస రాము, పెద్దూరి శ్రీనివాస్,అడుప కమలాకర్,సుంకరి బాబు,సట్ల అనిల్, వేల్పుల కార్తీక్, తాండ్ర హరీష్,లింగం సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## బాలవికాస ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణానికై గ్రామ నాయకులతో సమావేశం



**జఫర్గడ్ ప్రతినిధి,ఏప్రిల్ 27, (తరంగాలు):**
మండలంలోని తిడుగు గ్రామంలో 30 మంది సభ్యుల నాయకులతో ఆదర్శ గ్రామ నిర్మాణం పై సమావేశం ఏర్పాటు చేశారు. బాలవికాస గత 40 సంవత్సరాలుగా తెలంగాణలో కాక ఎనిమిది రాష్ట్రాల్లో పలు గ్రామాభివృద్ధి పథకాలు ప్రారంభించి వాటిని కొనసాగిస్తూ లక్షలాది మందికి లబ్ధిని చేకూరుస్తుంది గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఒక్కరితో సాధ్యం కాదని గ్రామ పౌరులందరూ గ్రామాలలో మార్పు సాధ్యమవుతుందని సూచించారు గ్రామాలలో స్థిరమైన మార్పు కొరకు నాయకులంతా కలిసి పనిచేయాలని ప్రజలను కలుపుకొని గ్రామాభివృద్ధి ని సాధించాలని ఒక్కరుగా చేయలేనిది అందరు కలిసి చేస్తే సాధ్యమవుతుంది గ్రామం ఆదర్శ గ్రామం మారాలంటే నాయకులంతా ఐక్యమత్యంతో పార్టీలకు కులమత వర్గాలకు అతీతంగా కలిసి పనిచేయాలి గ్రామం మనది బాధ్యత మనదే అనే ఉద్దేశంతో ప్రజలలో అవగాహన పెంచుతూ చైతన్యం పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆదర్శ గ్రామ నిర్మాణ పథకం మేనేజర్ మంజుల చెప్పారని సమస్త ప్రతినిధి వసంత తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గోపు సోమయ్య మాట్లాడుతూ సమస్త మా గ్రామాన్ని దత్తత తీసుకున్నందుకు మాకు సంతోషంగా ఉందని మా గ్రామంలోని ప్రతి వీధిలో నుండి ఈ పథకంలో భాగస్వాములు అయ్యేవిధంగా చూసుకుంటామని తెలిపారు గ్రామపంచాయతీ నుండి పూర్తి సహకారం అందజేస్తామని గ్రామ సభకు ప్రతి కుటుంబం కనీసం ఒక్కరైనా హాజరు కావడానికి ప్రయత్నం చేస్తామని ప్రజలందరినీ కలుపుకొని మార్పు దిశగా అడుగులు వేస్తామని తెలిపారు.అలాగే ఉప సర్పంచ్ కలకోటి మనోహర్ మాట్లాడుతూ సమస్త మా గ్రామానికి ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటామని అందరం కలిసి ఊరు కోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపు సోమయ్య, ఉపసర్పంచ్ కలకోటి మనోహర్, వార్డు సభ్యులు,అన్ని పార్టీల నాయకులు, గ్రామ కార్యదర్శి, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు సమస్యలపై కలెక్టర్‌ను కలిసిన గంట సంజీవరెడ్డి

• రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని వినతి



**మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,ఏప్రిల్.27, తరంగాలు:**
వ్యవసాయ మార్కెట్ కమిటీ కేసముద్రం చైర్మన్ గంట సంజీవరెడ్డి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ని మహబూబాబాద్ సమీకృత జిల్లా కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు.అనంతరం సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ కమిటీ కేసముద్రం నందు ఏర్పాటుచేసిన మార్కెట్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం లో నెలకొన్న సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల విషయమై జిల్లా కలెక్టర్ ని వ్యక్తిగతంగా కలిసి రైతుల యొక్క సరుకు కాంటా పూర్తిచేసుకుని ఎగుమతుల కొరకు వేచి చూడడం ,లారీల కొరత మార్కెట్ యార్డు పూర్తిగా బస్తాలతో నిండి ఉండటం వలన తమ వంతు కొరకు రైతుల పడి కాపులు చేస్తున్నారని తెలిపారు. ఖాళీ గోనెసంచుల కొరత తదితర విషయాలపై చర్చిస్తూ పై సమస్యలను అధిగమించవలన్న, ప్రాంతాలవారీగా గ్రామాల వారీగా సబ్ సెంటర్లు ఏర్పాటుకు కృషి చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ని కలిసి సమస్యలు విన్నవించడం జరిగిందనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# అంత్యక్రియలను అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు





**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 27, ( తరంగాలు):**
ఇల్లందు మండలం ఇందిరా నగర్ పంచాయతీ లోని రెండోవ వార్డ్ లో వడ్డెర కాలానికి చెందిన రాపోలు. రాములు అనారోగ్యంతో మృతి చెందినాడు,స్థానికంగా ఉన్న అటవీ భూమిలో అంత్యక్రియలునిర్వహిస్తామని ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో అటవీ అధికారులు అడ్డుకున్నారు. స్థానిక ప్రజలకు అధికారుల మధ్య వాగ్వాదం చేటుచేసుకున్నది, పోలీసులు వచ్చి సమస్యను పరిష్కరించాలని చూడగా స్థానిక మహిళలు గత కొన్ని సంవత్సరాలుగా మేము ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తునమని అటవీ అధికారులు వేసిన కంచె ను తొలగించి శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. స్థానికులు మాకు స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మోర పెట్టుకున్న పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యే ను ఎన్ని సార్లు కలిసిన చూద్దామని తెలిపారు. కానీ సమస్యకు నేటికీ పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పరిష్కారించాలని మాజీ ఉపసర్పంచ్ ఎల్లయ్య, శెట్టి రవి, ప్రస్తుత ఉపసర్పంచ్ ఆదిత్య, స్థానిక ప్రజలు వేడుకున్నారు.

# స్వీయ గణనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

• జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 27**
జిల్లాలో జనగణన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు స్వీయ గణన (Self Enumeration) ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి డిజిటల్ జనగణన నమోదు కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో, సోమవారం రోజున కలెక్టర్ అంకిత్ తన నివాసంలో స్వయంగా స్వీయ గణన విధానంలో తన కుటుంబ వివరాలను ఆన్లైన్ ద్వారా నమోదు చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆన్లైన్ ద్వారా స్వయంగా వివరాలను నమోదు చేసుకోవడం వల్ల ప్రజల సమయం ఆదా కావడంతో పాటు ఖచ్చితమైన సమాచారం నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ముందుగానే తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మే 11వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని, ఆ సమయంలో ఇప్పటికే స్వీయ గణన పూర్తి చేసిన వారు నమోదు సమయంలో పొందిన యూనిక్ ఐడీ నంబర్‌ను తెలియజేయాలని అన్నారు. స్వీయ గణన చేసిన ప్రతి ఒక్కరు తమకు వచ్చిన ఐడీ నంబర్‌ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని, తద్వారా ధృవీకరణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండవచ్చని తెలిపారు.
జనగణన ప్రక్రియ దేశ అభివృద్ధికి అత్యంత కీలకమైందని పేర్కొంటూ, జిల్లా ప్రజలు బాధ్యతతో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అంకిత్ కోరారు. జనాభా లెక్కల స్వీయ గణనలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సరైన సమాచారాన్ని అందించడంలో సహకరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు.

### జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

# ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు

• జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఏప్రిల్ 27**
జిల్లాలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా పరిస్థితులపై జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం సంబంధిత శాఖల అధికారులు,రీజినల్ మేనేజర్లు, ఏరియా మేనేజర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంధన సరఫరా వ్యవస్థలో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా విషయంలో ఎటువంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో రిటైల్ స్థాయిలో అపోహల కారణంగా అనవసర గందరగోళం ఏర్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, ముందస్తు కొనుగోళ్లు చేయకుండా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వరి కోత యంత్రాలు, రవాణా లారీలు, వ్యవసాయ యంత్రాలకు ఇంధన సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పెట్రోల్ బంక్‌పై క్షేత్రస్థాయి పర్యవేక్షణ పెంచాలని, తాసిల్దారులు బంకుల రికార్డులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇండెంట్ బుకింగ్ విధానాన్ని ముందుగానే సమర్థవంతంగా అమలు చేయాలని, అవసరమైన చోట ముందస్తు బుకింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి అధిక మొత్తంలో డీజిల్ కొనుగోలు జరిగే అవకాశం ఉన్నందున అటువంటి కార్యకలాపాలు పునరావృతం కాకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వంటి వేదికల ద్వారా జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందని తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఇటువంటి ప్రచారాల వల్ల ప్రజల్లో భయాందోళనలు ఏర్పడి అనవసరంగా ముందస్తు కొనుగోళ్లు జరుగుతున్నాయని, జిల్లాలో ఎటువంటి కొరత లేదని స్పష్టం చేశారు. రిటైల్ అవుట్‌లెట్ల వద్ద నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, పౌరసరఫరాల శాఖతో పాటు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ, పారిశ్రామిక అవసరాల పేరుతో అధిక మొత్తంలో డీజిల్ నిల్వచేసి బ్లాక్ మార్కెటింగ్ లేదా అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల స్టాక్ వివరాలను వెంటనే సమగ్ర నివేదిక రూపంలో సమర్పించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్ ను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా జరిగే పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లు మరియు రవాణాను అరికట్టవచ్చని తెలిపారు. రిటైల్ అవుట్‌లెట్లపై పౌరసరఫరాల శాఖతో కలిసి నిరంతర పర్యవేక్షణ అవసరమని అన్నారు . బ్లాక్ మార్కెట్ లేదా అక్రమ రవాణాలో పాల్గొనేవారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# రైతుల కోసం బంద్ విజయవంతం -డీలర్లు ఏకగ్రీవ డిమాండ్



**నల్లబెల్లి, ఏప్రిల్ 26 తరంగాలు:**
నల్లబెల్లి మండలంలో ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్త బంద్ పిలుపు ఘన విజయాన్ని సాధించింది. ఉదయం నుంచే ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేశారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఉత్పత్తిదారుల తప్పుడు విధానాలను వ్యతిరేకిస్తూ ఈ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు గోనె రాంబాబు మాట్లాడుతూ లింక్ ప్రొడక్ట్స్ బలవంతం చేయకుండా ఎరువులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎరువుల సరఫరాలో ఎఫ్ఓఎల్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు.
ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని డీలర్లు స్పష్టం చేశారు. రైతుల భారం తగ్గించేందుకు విధానపరమైన మార్పులు అత్యవసరమని అన్నారు. మండల శాఖ అధ్యక్షుడు కాసం మధుసూదన్ రెడ్డి రైతు-డీలర్ సంబంధాలు బలహీనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు పెద్ద బోయిన బిక్షపతి, గోనె వీరస్వామి, మచ్చిక రవి, తిప్పని శ్రీనివాస్, అమరేందర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. బంద్‌కు రైతులు కూడా సంఘీభావం ప్రకటించి పాల్గొన్నారు. డీలర్ల ఐక్యతతో జరిగిన ఈ నిరసన రైతు సమస్యలను ప్రభుత్వం గమనించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
మంగళవారం, 28 ఏప్రిల్, 2026


## బోజ్జాయి గూడెం పంచాయతీ నుండి కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 27, ( తరంగాలు):**
ఇల్లందు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బోజ్జాయి గూడెం సర్పంచ్ ప్రియాంక, ఉప సర్పంచ్ కిరణ్ ఆధ్వర్యంలో. నాల్గవ వార్డు మెంబర్ బొర్రా సుజాత, బొర్రా రాజేష్, అలాగే కొల్లాపురం గ్రామ నుంచి సంకబుద్ది రాములు, సంతోష్, ఎస్సాల ప్రవీణ్, యడల శాంసన్, బండారి సాయిరాం, వేణు, బిఆర్ఎస్ పార్టీ కి చెందిన పలువురు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు, ఎమ్మెల్యే వారికి పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారని తెలిపారు.

## గ్రామ గ్రామాన మే డే జెండావిష్కరణలు, వారోత్సవాలు జరపండి: సిఐటీయు



**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 27, ( తరంగాలు):**
మేడే జయప్రదం కోసం ఏలూరి భవన్ లో సిఐటీయూ మండల కమిటీ బత్తుల దేవేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి పాల్గొని మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికులపై పాలకులు కార్పోరేట్ శక్తులు శ్రమదోపిడి చేస్తున్నారని, మోడీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.శతాబ్ద కాలంగా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు,చట్టాలను రద్దు చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పోరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని మేడే సందర్భంగా కార్మిక వర్గం గ్రామ గ్రామాన జెండావిష్కరణలు ,వారోత్సవాలు జరపలని సిఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబి, మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ లు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో కళ్లేపల్లి మరియా, ఆరెం అరుణ, కామ నాగరాజు, కటకం రాజయ్య, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

- పుష్కర్ ఆలయంలో పూజలు



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,ఏప్రిల్.27,తరంగాలు:**
బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేసముద్రం మండలానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజస్థాన్ లోని పుష్కర్ లో గల గాయత్రి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు తెలంగాణ రాష్ట్ర సాధనకై ఏర్పడిన పార్టీ బారసా అని తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ పాలనలో దేశంలోనే అగ్రస్థానం నిలిపారని బారాస పార్టీ తెలంగాణ ప్రజల సొంత పార్టీ అని రాబోయే ఎన్నికల్లో బారాస పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కేసీఆర్ ముఖ్యమంత్రి అయి తెలంగాణ రాష్ట్ర ప్రజల కష్టాలు తొలగిపోవాలని ఆ గాయత్రి మాతను వేడుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి సంపత్ కుమార్ రెడ్డి,నర్సింగం.వెంకటేశ్వర్లు, బచ్చు పరమేశ్వర్, అప్పయ్య రేణిగుంట్ల సుధాకర్ గోవర్ధన్ కేసముద్రం మండలం వాసులు పాల్గొన్నారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరతలు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి జె. రమేష్



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్. 27, తరంగాలు:**
ప్రస్తుతం జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరతలు లేకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చర్యలు తీసుకుంటామని ప్రజలు ఎలాంటి ఆందోళ చెందాల్సిన అవసరం లేదన్నారు,సంబంధిత పెట్రోల్, డీజిల్ ఏజెన్సీల కంపెనీ ప్రతినిధులతో ఎమ్మెస్ఓ లతో మాట్లాడి స్టాకు తెప్పించడం జరుగుతుందనీ సోమవారం సాయంత్రం జిల్లా పౌరసరఫరాల అధికారి రమేష్ ఒక్క ప్రకటనలో తెలిపారు.

# ఇల్లందులో పెట్రోల్ డీజిల్ కొరతతో వాహనదారుల ఇక్కట్లు





**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 27, ( తరంగాలు):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో పెట్రోల్ ప్రదానంగా డీజిల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇల్లందు పట్టణం శివారు ప్రాంతాల్లో ఆరు పెట్రోల్ డీజిల్ బంకులు ఉన్నప్పటికీ సగం బంకులలో సరఫరా లేకపోవడంతో స్థానికులు ఉన్న బంకులలో డీజిల్ పెట్రోల్ కోసం భారీగా వాహనాలు బారులు తీరుతుండడంతో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కొరత కారణంగా కొందరు డీజిల్ నిల్వలు చేసుకోవడంతో కృత్రిమ కొరత ఏర్పడుతున్నాయి. జిల్లాలో ఇంధనం కొరతలేదని ఒకవైపు అధికారులు చెబుతున్న వాస్తవిక పరిస్థితులు కొన్నిచోట్ల ప్రతికూలంగా మారాయి. కాగా సరఫరా జరగగానే వాహనదారులకు ఇంధనం సరఫరా చేస్తూ వస్తున్నామని డీలర్లు చెబుతున్నారు.

# ఎరువుల షాపులు బంద్ సంపూర్ణం

- ఇతర ఉత్పత్తులను రైతులకు అంటగడుతున్న కంపెనీలు
- సబ్సిడీని రైతులకు అందకుండా ఇబ్బందుల గురి చేస్తున్నారు




**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.27, తరంగాలు:**
కేసముద్రం మండల పెర్టిలైజర్స్ మరియు పెస్టిసైడ్స్, సీడ్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం స్థానిక తహసిల్దార్ మరియు వ్యవసాయ అధికారిని కలిసి తమ సమస్యలను వినతి పత్రం ద్వారా వివరించడం జరిగింది, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.విషయం:ఎరువుల సరఫరాలో జరుగుతున్న అవకతవకల గురించి,దానివల్ల వ్యాపారస్తులు మరియు రైతు సోదరులు పడుతున్న ఇబ్బందుల గురించి. ప్రభుత్వం రైతులపై భారం పడకుండా ఎరువులపై కోట్ల రూపాయల సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నాయి కానీ ఎరువుల కంపెనీలు మరియు సరఫరాదారులు ఇట్టి సబ్సిడీని రైతులకు పూర్తిస్థాయిలో అందకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. 1)ఎరువుల డీలర్లకు రవాణా ఖర్చులు ఇవ్వడం లేదు 2)ఎరువులపై ఇతర ఉత్పత్తులను బలవంతంగా అంట కడుతున్నారు.ఈ విధానం వలన వ్యాపారస్తులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. తద్వారా రైతు సోదరులకు న్యాయమైన సరఫరా చేయలేకపోతున్నాము అందువలన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మా సమస్యలు పరిష్కరించాలని ఎరువుల సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని,మా నిరసన తెలియజేస్తూ రాష్ట్ర జిల్లా అసోసియేషన్ తీర్మానం ప్రకారము సోమవారం ఒకరోజు బంద్ పాటిస్తున్నాము అని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో వోలం వీరభద్రరావు కోయగురి యాకూబ్ రెడ్డి వోలం శ్రీనివాస్ రావు, వోలం సందీప్,సంకు శ్రీపాల్ రెడ్డి, సతీష్ శ్రీనివాసరెడ్డి రాజశేఖర్ శ్రీనివాస్ వెంకన్న రవి దినేష్ తదితరులు పాల్గొన్నారు.




# నల్లబెల్లిలో సీతారాముల బ్రహ్మోత్సవాలు వైభవంగా








**నల్లబెల్లి, ఏప్రిల్ 26 తరంగాలు :**
మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మొదట శని, ఆదివారాల్లో ప్రధాన అర్చకుడు కొండ కృష్ణస్వామి నేతృత్వంలో విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించి అనంతరం సోమవారం బ్రహ్మోత్సవాల సందర్భంగా నవగ్రహ పూజ, హోమం ఘనంగా నిర్వహించగా, అనంతరం సీతారాముల కళ్యాణం ఆలయ ప్రాంగణంలో అత్యంత వైభవంగా జరిగింది. కళ్యాణోత్సవాన్ని చూసేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ మంటపంలో సుదర్శన హోమం ప్రతిష్ఠాత్మకంగా జరగగా, ఘంటానాదాలు, వేదమంత్రాలు, మేళతాళాల మధ్య స్వామివారి కళ్యాణం కనులను కట్టిపడేసింది. ఉత్సవాలలో పాల్గొన్న భక్తులు సీతారాముల ఆశీస్సులు పొందుతూ తీర్థప్రసాదాలు స్వీకరించారు. మొత్తం కార్యక్రమం భక్తి--శ్రద్ధల నడుమ అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో పూర్తయ్యింది.



# మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కలెక్టర్ సత్య శారద

- కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం



**తరంగాలు, ఏప్రిల్:27, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్య శారద సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కజొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సేకరణ, తూకం, నిల్వ, రవాణా వంటి ప్రక్రియలు పారదర్శకంగా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కేంద్రంలోని ఏర్పాట్లు నిల్వ సదుపాయాలను పరిశీలించిన అనంతరం రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతులు తమ పంటను సులభంగా విక్రయించుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డిఓ ఉమారాణి, డి సి ఓ నీరజ, ఎమ్మార్వో రాజ్ కుమార్, డి ఎం సురేఖ, మార్కెట్ సెక్రటరీ కృష్ణ మీనన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న నిల్వలపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్- సత్య శారద



**తరంగాలు, ఏప్రిల్:27, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు పండించిన మొక్కజొన్న పంట నిల్వల పరిస్థితి పై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం నర్సంపేట అగ్రికల్చర్ మార్కెట్ గోదాం ను సందర్శించి ఎమ్మెల్యే అక్కడికి చేరిన మొక్కజొన్న నిల్వల భద్రతను పరిశీలించారు. గోదాం వద్దకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఏ ఒక్క రైతు నష్టపోకూడదని, రైతుకు న్యాయం జరిగే విధంగా అధికార యంత్రాంగం పనిచేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డిసిఓ నీరజ, ఆర్డీవో ఉమారాణి, డీఎం మార్కెటింగ్ సురేఖ, మార్క్ ఫెడ్ అధికారి నిరంజన్, మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితుడికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండ



**కల్వకుర్తి.ఏప్రిల్ 27 తరంగాలు ప్రతినిధి.**

కల్వకుర్తి నియోజకవర్గం లోని వెల్దండ మండలం చౌదర్ పల్లి గ్రామానికి చెందిన కాటమోనీ మహేష్ కిడ్నీ మార్పిడి చికిత్స నిమిత్తం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మానవత్వంతో స్పందించి10,000రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరిగింది.ఉప్పల వెంకటేష్ సహకారం తో గ్రామ ఉప సర్పంచ్ దోబ్బల రాజీవ్ వీరబొమ్మ బుచ్చిబాబు. వంశీ బాధితుడి కుటుంబ సభ్యులకు పది వేల రూపాయలను అందజేయడం జరిగింది. మహేష్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికిఆపద్బాంధవుడిలా ఆదుకునే గొప్ప వ్యక్తి రాష్ట్ర మిషన్ భగీరథ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ అని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోవార్డు సభ్యులు తిరుపతయ్య, భరత్ మరియు మోహన్, స్వామి తదితరులు పాల్గొన్నారు. కష్టకాలంలో ఆపన్న హస్తం అందించిన ఉప్పల వెంకటేష్ గారికి ఈ సందర్భంగా మహేష్ కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలుతెలియజేయడం జరిగింది

# ఘనంగా బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.27, తరంగాలు:**

సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని బి ఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ నజీర్ అహ్మద్ , అదేవిధంగా మున్సిపాలిటీ కేంద్రంలోని పొట్టి శ్రీరాములు సెంటర్ లో పట్టణ అధ్యక్షులు గూగులోత్ వీరునాయక్ ల ఆధ్వర్యంలో ఆ పార్టీ పతాక ఆవిష్కరణ చేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రదాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు , చాలా కృషి చేసి మన రాష్ట్రాన్ని సాధించారు సాధించిన, ఈ రాష్ట్రంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్ బిజెపిలో కేసీఆర్ పై విమర్శలు చేస్తున్నారు. ఈరోజు ఈ రాష్ట్ర సాధన లేకుంటే ఈ పార్టీలు ఈ రాష్ట్రంలో పరిపాలన కొనసాగించేవ కెసిఆర్ పై విమర్శలు చేస్తే సూర్యుని మీద దుమ్ముబోసినట్టే వారి మొఖంపై పడుతుంది .ఇలాంటి విమర్శలు మాని ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కొరకు పరిపాలన కొనసాగించాలని కోరుతున్నాం. రైతులు పడే కష్టాలు ఇంత అంత లేవు వారి కష్టాలను తీర్చి రైతులకు ఊరట కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల శ్రీనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం శ్రీనివాస్, ఊకంటి యాకుబ్ రెడ్డి, జాటోత్ హరీష్ నాయక్, వార్డు కౌన్సిలర్లు వినయ్ రెడ్డి, ఆగే రాము, పావిరాల శరత్, ఏర్పుల కుమారస్వామి, బిర్రు వెంకన్న,బాదావత్ పవన్ కళ్యాణ్, జి రమేష్, తారా సింగ్, భానోత్ వెంకన్న, తోట శీను, శ్రీరంగం, కాసు సాయి, భానోత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి వినతులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి



- **ఉద్యోగులందరూ స్వీయ జనగణన కార్యక్రమంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్**

మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.27, తరంగాలు: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు, జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని, ప్రతి దరఖాస్తులు పారదర్శకంగా పరిశీలించాలని, సూచించారు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన అన్ని కార్యక్రమాలను అందరూ సమిష్టిగా విజయవంతం చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో మరింత పకడ్బందీగా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు, ప్రజావాణి దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కోరారు.ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే స్వీయ జన గణన కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు తమ పరిధిలో ఉన్న ప్రతి ఉద్యోగులు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు,ప్రజావాణిలో వివిధ శాఖలలో మొత్తం (179) దరఖాస్తులు వచ్చాయని తెలిపారు మరిపెడ మండల కేంద్రంలోని సర్వే నంబర్ 264లో గల 02 ఎకరాల 16 గుంటల ప్రభుత్వ భూమిని, నిరుపేదలైన సుమారు 30 మంది పాత్రికేయులకు నివాస గృహాల కోసం కేటాయించాలని మరిపెడ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న భూ మార్పిడి, వారసత్వ హక్కులు మరియు ఇతర ధరణి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారు.కొత్త రేషన్ కార్డుల మంజూరు మరియు ఆసరా పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి వినతులు అందాయి. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం మరియు తాగునీటి సమస్యలపై ప్రజలు కలెక్టర్‌కు విన్నవించారు.ప్రజావాణి కార్యక్రమం సమయం పూర్తి అయిన అదనంగా రెండున్నర గంటల వరకు దరఖాస్తులతో వేచి ఉన్న ప్రజల యొక్క వినుతులను స్వీకరించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు, మండల కేంద్రాలలోని గూగుల్ మీట్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యలను వివరించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు, ఈ ప్రజావాణి కార్యక్రమంలో మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారినీ కృష్ణవేణి,జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మధుసూదన రాజు, అన్ని విభాగాల జిల్లా అధికారులు,పర్యవేక్షకులు మదన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



# సమతుల్య రసాయనిక ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం



**తరంగాలు, ఏప్రిల్:27, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

ఖానాపురం మండలం బుధరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ( ఆత్మ) ఆధ్వర్యంలో రైతులకు సమతుల్య రసాయనిక ఎరువుల వాడకం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయనిర్మల హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువులే కాకుండా, పచ్చిరొట్ట ఎరువులను, జీవన ఎరువులను, సేంద్రియ ఎరువులను వాడుతూ నేల భూసారాన్ని రక్షించుకోవాలని విచక్షణ రహితంగా ఎరువులు మరియు పురుగుమందులు వాడడం వలన పర్యావరణ మరియు సకల జీవరాశుల ఆరోగ్య నష్టం, సమస్త ఆహారపు గొలుసు, అత్యంత విషపూరితం అవుతాయని ఏక పంటలే కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్నటువంటి ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తూ పంట మార్పిడి అవలంబించాలని అన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకై రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సబ్సిడీ సదుపాయాలను వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కోత అనంతరం వరి మరియు మొక్కజొన్న పంటల కొయ్య కాళ్లు తగలబెట్టకూడదని, తగలబెడితే భూమిలో ఉన్న పంటకు మేలు చేసేటటువంటి మిత్ర సూక్ష్మ జీవరాసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయి నేల సారం క్షీణించునని అన్నారు. రైతులు సమగ్ర వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించి లాభసాటిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ నరసంపేట డివిజన్ కమిటీ చైర్మన్ యడ్ల బిక్షం రెడ్డి, మండల వ్యవసాయ అధికారి భోగ శ్రీనివాస్, ఆత్మ డివిజన్ కమిటీ సభ్యురాలు గట్ల స్రవంతి, సర్పంచ్ పెసరు రాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు రాజ్ కుమార్, అంకుషావలి, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# గైగొళ్లపల్లిలో ఘనంగా బీఆర్ఎస్ జెండా పండుగ..



**పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 27 (తరంగాలు) :**
బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గైగొల్లపల్లి గ్రామంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం పాలేరు మాజీ శాసన సభ్యులు కందాల ఉపేందర్ రెడ్డి పిలుపు మేరకు పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం గ్రామశాఖ అధ్యక్షులు తోడేటి మల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరెడ్డి మనోహర్ రెడ్డి, ముదిరెడ్డి చంద్రారెడ్డి, మట్టే మైసయ్య, మల్లికంటి శశిధర్, ఉపాధ్యక్షులు జిల్ల హుస్సేన్, సెక్రటరీ బాధవత్ సైదులు, గైగొల్లపల్లి గ్రామసర్పంచి బాధవత్ అనూష, బీఆర్ఎస్ వార్డు మెంబెర్స్ వారి ఆధ్వర్యంలో గైగొల్లపల్లి స్కూల్ దగ్గర పార్టీ ఆవిర్భావం పురస్కరించుకొని సోమవారం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ షాపుల బందు విజయవంతం




**పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 27 (తరంగాలు) :**
ఎరువులు, పురుగు మందుల స్టాక్ పాయింట్ నుండి తీసుకురావడానికి రవాణా ఖర్చులు డీలర్ల పై వేయడంతో దానిని నిరసిస్తూ కూసుమంచి మండలంలోని పురుగుల మందుల, ఎరువుల దుకాణ యజమానులు సోమవారం షాపులు బంద్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫెర్టిలైజర్ షాప్ అసోసియేషన్ ఈసీ మెంబర్ ఎండి రంజాన్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు, ఎరువులు, ఫెర్టిలైజర్ షాపుల బంద్ నిర్వహించామని అలాగే నిరసన ప్రదర్శన కూసుమంచి మండల కేంద్రంలో చేపట్టామని ఆయన తెలిపారు. మండల డీలర్ల సంఘం అధ్యక్షులు ఇంటూరి నారాయణ మాట్లాడుతూ కంపెనీలు ఎరువులు, పురుగు మందుల విషయంలో ఏదో ఒక లింకు పెట్టడాన్ని స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. కంపెనీ లు అవలంభిస్తున్న విధానంతో రైతులపై అధిక భారం పడుతుందని, ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు శ్యాంసుందర్ రెడ్డి, కన్నయ్య, తిరుపతిరావు, కూరపాటి సందీప్, హరీష్, చెన్నారెడ్డి, సుధీర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల స్తూపం వద్ద గులాబీ జెండా ఆవిష్కరించిన పట్టణ ప్రధాన కార్యదర్శి- వేణుముద్దల శ్రీధర్ రెడ్డి



**తరంగాలు, ఏప్రిల్:27, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
నర్సంపేట నియోజకవర్గం పట్టణం లో బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నర్సంపేట పట్టణ అమరవీరుల స్తూపం వద్ద గులాబీ జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసి విప్లవ శంఖం మోగించిన దిక్కార వేదిక, సమైక్య సంఖ్యలను తెంచి స్వరాష్ట్ర కాంక్షలు సహకారం చేసిన యుద్ధ గీతిక, పదేళ్ల పాలనతో ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చి దిద్దిన అభివృద్ధి పతాక, తెలంగాణ జాతి ఆత్మగౌరవ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గులాబీ దీపిక, ప్రజల విశ్వాసానికి ప్రతీక, ప్రజా ఉద్యమ పతాక భారత రాష్ట్ర సమితి 26వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పాపపు పాలనలో ప్రజల జీవితాలు నలిగిపోతున్న వేల ప్రజల గుండెల్లో మార్మోగుతున్నది ఒక్కటే నినాదం...సంక్షేమం అడుగంటి, అభివృద్ధి నిలిచిపోయి, అరాచకం తాండవం చేస్తున్న కాలంలో వినిపిస్తున్నది ఒక్కటే ఆవాజ్.. రేవంత్ పోవాలి.. కెసిఆర్ రావాలి. ఉద్యమంలోనైనా, అధికారంలోనైనా, ప్రతిపక్షంలోనైనా ఎప్పుడూ ప్రజల పక్షానే నిలబడి తెలంగాణను కంటికి రెప్పలా కాపాడుకున్న పార్టీ మన బి ఆర్ ఎస్ పార్టీ అని అన్నారు. పోరాటాల పునాది మీద పుట్టి, ప్రజల విశ్వాసంతో ఎదిగి, ప్రతి గుండెలో నాటుకుపోయిన గులాబీ శక్తి మన బిఆర్ఎస్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ బాధ్యులు, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్ లు, వార్డు అధ్యక్షులు, మహిళా విభాగం అధ్యక్షురాలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, పట్టణ పార్టీ ముఖ్య నాయకులు, యువజన విభాగం బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జైల్ శాఖ 32వ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు ప్రారంభం





- **ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర జైల్ శాఖ డైరెక్టర్ జనరల్**
- **డాక్టర్ సౌమ్య మిశ్రా ( ఐపీఎస్ )**

**తరంగాలు, ఏప్రిల్ :27, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండల కేంద్రంలో రాష్ట్ర జైలు శాఖ ఆధ్వర్యంలో 32 వ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు ను ప్రారంభించడం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర జైలు శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపీఎస్ హాజరై ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ కల్తీ లేని పెట్రోల్, డీజిల్ వాహనదారులకు అందించడమే లక్ష్యంగా జైల్ శాఖ నిర్వహించే పెట్రోల్ పంపు ల ముఖ్య ఉద్దేశమని, రైతుల కోసం, స్థానిక ప్రజల కోసం 24 గంటల పాటు పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వాహనదారులకు ఎలాంటి కల్తీ లేకుండా, మీటర్ రీడింగ్ లో తేడా లేకుండా నిర్వహిస్తారని జై శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పంపులకు వాహనదారుల నుండి, రైతుల నుండి అనూహ్య స్పందన వస్తున్నట్లు తెలుపుతూ, జైల్లో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలచే పంపుల నిర్వహణ చేయిస్తున్నట్లు తెలిపారు. జై శాఖ ఆధ్వర్యంలో డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రాకు గౌరవ వందనం చేశారు. అనంతరం జైల్ శాఖ అధికారులు డీజీ సౌమ్య మిశ్రా ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ అధికారి మనీషా మెహరా, జిల్లా జైల్ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, స్థానిక గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, ఆత్మ డివిజన్ కమిటీ చైర్మన్ యడ్ల బిక్షం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలులో తీవ్ర జాప్యం...

- **గోన సంచులు ఇవ్వకుండా కాలయాపన చేస్తారా ?**
- **బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు - బాల్నే వెంకన్న**



**తరంగాలు, ఏప్రిల్:27, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**
నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండల కేంద్రంలోని మొక్కజొన్న రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికారులు గోరంగా విఫలమయ్యారని విమర్శిస్తూ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్ మాట్లాడుతూ ఏప్రిల్ 11 వ తేదీన స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటికీ, నేటికీ రైతుల ఇబ్బందులు తొలగలేదని మండిపడ్డారు. ఆరబోసిన మొక్కజొన్నలు కాంట వేయడానికి అధికారులు, కొనుగోలు కేంద్రం సిబ్బంది కనికరించడం లేదని నాయకులు ఆరోపించారు. కనీసం గోనె సంచులు కూడా సరఫరా చేయకుండా కాలయాపన చేస్తూ అమాయక రైతులను ఆగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గోనె సంచుల గురించి స్థానిక సి ఈ ఓ ని రైతులు అడిగితే మీరే బయట గోనె సంచులను కొనుగోలు చేసుకుని రావాలని బస్తాకు 15 రూపాయలు ప్రభుత్వం కట్టిస్తుందని సమాధానం చెప్తారు. అధికార పార్టీ నాయకులు పైరవీలు చేసిన రైతుల మొక్కజొన్నలను మాత్రమే వెనువెంటనే కాంట వేస్తున్నారని, సామాన్య రైతులను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. మండలంలో రైతులు మండుటెండలో తల్లడిల్లుతుంటే ఎమ్మెల్యే మాత్రం ఏసీ రూముల్లో కూర్చుని కాలం గడుపుతున్నారని వారికి రైతుల బాధలు పట్టవా అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని ఒకవేళ వర్షం పడితే తడిసిన మొక్కజొన్నలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. డిఎం రంజిత్ రెడ్డి తో ఫోన్లో సంప్రదించి రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. లేనిపక్షంలో రైతులందరిని ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేసి రైతుల పక్షాన భారీ ధర్నాలు చేయవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ మండల నాయకులు, సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో రైతులు, మహిళ రైతులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

- **ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి**
- **వర్ధన్నపేట మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య**



**వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 27,తరంగాలు**
రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని,ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్ అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు ఆదేశాల మేరకు వర్ధన్నపేట



మండలంలోని చంద్రుతండ , రాంధాన్ తండ గ్రామాలలో పిఏసిఎస్ (పాక్స్), వర్ధన్నపేట వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య,వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్య నారాయణ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతు సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోకూడదనే ఉదేశ్యంతో ప్రభుత్వమే మద్దతు ఇచ్చి దాన్యాన్ని కొనుగోలు చేయడం తో పాటు సీజన్ కు ప్రభుత్వానికి 5000 కోట్ల నష్టం వస్తున్నప్పటికీ రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు. వరి ధాన్యం కొనుగోలుకు 23000 కోట్లు, మక్కల కొనుగోలుకు 5000 కోట్లు ప్రభుత్వం రుణంగా తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలని సద్వినియోగం చేసుకొని మద్దతు ధరకు దాన్యాన్ని అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం జిల్లా నాయకులు మరుపట్ల సాయికుమార్, చంద్రు తండా సర్పంచ్ భూక్యా లీలా రవి నాయక్ , రాంధాన్ తాండ సర్పంచ్ గూగులోత్ వెంకన్న , మాలోత్ చిట్టి బాబు, మాజీ ఎంపీటీసీ గూగులోత్ సరోజ, కాంగ్రెస్ పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గూగులోత్ కిషన్ నాయక్, మాజీ సర్పంచ్ గూగులోత్ గోపాల్, గూగులోత్ ఈర్యా, మాజీ ఎంపీటీసీ గూగులోత్ మంగు లాల్,తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...



**పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 27 (తరంగాలు) :**
ఎత్తిన జెండాను దించకుండా పట్టుదల, నిబద్ధతతో ప్రయాణం చేసి, ఎన్నో కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొని, గమ్యాన్ని ముద్దాడి, సాధించిన స్వరాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఉద్యమ వీరుడు కేసీఆర్ సారథ్యంలో పురుడు పోసుకున్న బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తిచేసుకుని 26వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రమైన కూసుమంచిలో సోమవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆసిఫ్ పాషా, నాయకులు మల్లిడి వెంకటేశ్వరరావు, బారి రమేష్, ఆడెపు సతీష్, కక్కిరేణి వీరస్వామి, మక్కపల్లి రామకృష్ణ, మంద నాగులు, ఆడెపు వెంకటేష్, అబ్దుల్ అజీజ్, దామళ్ళ ఉపేందర్, గొల్లపూడి శ్రీను, కందుల వెంకన్న, బుర్ర శ్రీను, కొక్కిరేణి గోపి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణం బలి తీసుకున్న పార్టీ బీఆర్ఎస్

- **బొమ్మకంటి చంద్రమౌళి**



**పరకాల టౌన్, ఏప్రిల్ 27, తరంగాలు :**
బిఆర్ఎస్ పార్టీ తమ స్వార్థ ప్రయోజనాల లబ్దికోసం ఒక నిండు ప్రాణం బలి తీసుకున్న నీచమైన పార్టీ భారత రాష్ట్ర సమితి ,నాడు అగ్గిపెట్టె నాటకంలో శ్రీకాంత్ చారిని బలి తీసుకున్నారని నేడు ఆర్టీసీ ఉద్యోగులను రెచ్చగొట్టి శంకర్ గౌడ్ ప్రాణం తీసింది అని పరకాల మండల ఎస్సీ డిపార్ట్మెంట్ అధ్యక్షులు బొమ్మ కంటి చంద్రమౌళి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆడే నాటకాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని తమ స్వార్థం కోసం ఒక ఉద్యోగిని రోడ్డునకు ఈడ్చి తగలబడి చనిపోయే విధంగా రెచ్చగొట్టి శవ రాజకీయం చేసిందని అలాంటి పార్టీలకు రానున్న రోజులలో ప్రజలు మరొకసారి తరిమికొడతారని, ప్రజల కోసం నిత్యం కష్టపడే పార్టీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై పూర్తి విశ్వాసంతో నమ్మకంతో ప్రజలు ఉన్నారని, అలాంటి ప్రజా ప్రభుత్వంపై బురదజల్లే పనులు మానుకోవాలని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో ప్రజల కోసం నిరంతరం పేద ప్రజలపై కృషి చేస్తూ,అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారధ్యంలో ప్రజాపాలన కొనసాగిస్తుందని అన్నారు.

# నీలాయగూడెం గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి




- **గ్రామ సర్పంచ్ వట్టి కోటి మధు**

నల్లగొండ అర్సీ, ఏప్రిల్ 27, తరంగాలు :
నీలయగూడెం గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నానని గ్రామ సర్పంచ్ వట్టికోటి మధు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. ప్రధానంగా డ్రైనేజీ సమస్య ఉందని అన్నారు. అసరా పెన్షన్లు అనేకమందికి రావాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామంలో 23 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినవి అని, ఇంకా అర్హులైన వారందరికీ కూడా ఇల్లు మంజూరు చేస్తామన్నారు.తనను సర్పంచ్ గా గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 135 ఓట్ల మెజార్టీతో తనను గ్రామ ప్రజలు గెలిపించాలని అన్నారు. తనను గ్రామ ప్రజలు ,యువకులు, శ్రేయోభిలాషులు అందరు కలిసి తనను గెలిపించారని అన్నారు.

# తూర్పు తండా గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి

- **గ్రామ సర్పంచ్ ధనావత్ పార్వతి లక్ష్మ**



**నల్లగొండ అర్సీ, ఏప్రిల్ 27, తరంగాలు :**
తూర్పు తండా గ్రామ అభివృద్ధికి అన్ని రకాలుగా చేస్తున్నామని గ్రామ సర్పంచ్ పార్వతి లక్ష్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయి అన్నారు.ఈ మధ్యకాలంలో మిషన్ భగీరథ నీళ్లలో ఒక రకమైన వాసన వస్తూ ఉండడంతో ఆ నీటిని తాగడం లేదని అన్నారు. గ్రామ ప్రజలకు ప్రతిరోజు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈగ మల్లేశం





**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 27,తరంగాలు :**
శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం శ్రీ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.చారిత్రక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో అంగరంగ వైభవంగా భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు సోమవారం తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి.సోమవారం ఏకాదశి పర్వదినాన ఉదయం వరంగల్, హన్మకొండ జిల్లాల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మేళా తాళాలతో అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. మహిళలు అమ్మ వారికి కుంకుమపూజ నిర్వహించారు. నిత్య పూజతో ప్రారంభమైన పూజ కార్యక్రమాలు చతుష్టనార్చన, హరిద్రోక్షవం, బలి ఉత్సవం నిర్వహించిన అనంతరం అమ్మ వారిని అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి వద్నాల నరేందర్, అడెపు రవీందర్, బచ్చు ఆనందం, గోరంట్ల రాజు, బేతి అశోక్, బత్తుల రమేష్ బాబు, కుసుమ శ్యామ్, రాజేందర్, వేణు, సమ్మయ్య, కేదాసి వెంకటేశ్వర్లు, దిడ్డి రమేష్, తుమ్మ అశోక్, వేణుగోపాల్ పద్మశాలి కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఎస్పీ శబరీష్ క్రైమ్ రివ్యూ నిర్వహణ





**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్.27, తరంగాలు:**
సోమవారం మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని సబ్‌డివిజన్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు మరియు సంబంధిత విభాగాల అధికారులతో మహబూబాబాద్ జిల్లా టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ క్రైమ్ రివ్యూ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రస్తుత నేర స్థితిగతులు, పెండింగ్ కేసుల పరిష్కారం, విచారణల పురోగతి, లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసును నాణ్యతతో దర్యాప్తు చేసి, నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.అలాగే "మన ఊరు - మన బాధ్యత" కార్యక్రమం అమలుపై ప్రత్యేకంగా ఆరా తీసి, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, యువతలో అవగాహన కార్యక్రమాలు, ప్రజలతో సమన్వయం పెంపు వంటి అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.పోలీసులు ప్రజలతో సాన్నిహిత్యం పెంచుకొని, నేరాల నియంత్రణలో ముందుండాలని, సాంకేతిక వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని తెలిపారు.ఈ సమావేశంలో కేసులకు శిక్షలు సాధించడంలో ప్రతిభ కనబరిచి కృషి చేసిన అధికారులు సిబ్బందిని ఎస్పీ అభినందించి, సంబంధిత సీడీఓ లకు రివార్డులు అందజేశారు. అలాగే, కేసుల్లో శిక్షలు సాధించడంలో తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కంపల్లి వెంకటయ్యకు శాలువాతో సన్మానించి మెమెంటో అందించారు.
అనంతరం జిల్లా పోలీస్ వాహనాలపై ప్రత్యేకంగా ఇన్స్పెక్షన్ నిర్వహించగా, ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి వాహనాల స్థితి మరియు వాహనాలకు సంబంధించిన సమస్యలను నమోదు చేసి ఎంటీఓ ఆర్ఐ సోములు పర్యవేక్షించారు. వాహనాలను ఎల్లప్పుడూ మంచి స్థితిలో ఉంచి, సమయానికి మెయింటెనెన్స్ చేయాలని సూచించారు.డ్రైవింగ్ చేసేటపుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.




# కామారెడ్డి గూడెంలో ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు



నల్లగొండ అర్సీ, ఏప్రిల్ 27, తరంగాలు :
త్రిపురారం మండలం కామారెడ్డి గూడెంలో సోమవారం బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ పాపకంటీ సుష్మాగిరి బిఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు పాపగంటి గిరి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయని అన్నారు. 2 సంవత్సరాల్లో రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు.మరొకసారి కేసీఆర్ ను ముఖ్యమంత్రి చేసుకొని రాష్ట్ర అభివృద్ధికి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధనమ్మ నాగయ్య, గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు కన్నెగంటి శేఖరయ్య, నిరుడు పద్మాకర్ , సైదులు,మాజీ సర్పంచ్ నర్సింగ్ సైదులు, వార్డ్ మెంబర్లు గోగుల నిరంజన్, రెవిడాల మారేష్ ,కొండా వెంకన్న ,కనేకంటి ఎల్లమ్మ, గండికోట కిరణ్ పాల్గొన్నారు.



# ఇల్లంద మార్కెట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే నాగరాజు




**వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 27,తరంగాలు :**



వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని వ్యవసాయ మార్కెట్‌ను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రైతులు తీసుకువస్తున్న ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు--అమ్మకాల పరిస్థితులను పరిశీలించి, అక్కడి సౌకర్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా కొనసాగాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మార్కెట్‌లో తూకం, నిల్వ, రవాణా వంటి అంశాల్లో ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతులు తమ పంట ఉత్పత్తులకు తగిన ధర పొందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ముక్కలు/ వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ఉపయోగించవచ్చని భావిస్తున్న పాత ఎస్సీ హాస్టల్ భవనం మరియు పాత సినిమా హాల్‌ను అధికారులతో పాటు స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ భవనాలను నిల్వ కేంద్రా లుగా వినియోగించుకునే అవకాశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే తాత్కాలిక గిడ్డంగులు, అదనపు నిల్వ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేబీఎం హన్మకొండ జిల్లా అధ్యక్షులు జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, తహసిల్దార్ విజయ్ సాగర్, మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, జిల్లా నాయకులు పోశాల వెంకన్న గౌడ్, మరుపట్ల సాయికుమార్, అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇలు

- **పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ**
- **ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 45మందికి మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు**



**హన్మకొండ ప్రతినిధి, 27 ఏప్రిల్, తరంగాలు :**
పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పేద కుటుంబానికి గూడు - నీడ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. హన్మకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని 45 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను అభినందిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకుని పథకం ద్వారా అందే ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, "పేదవారి ఆత్మగౌరవ ప్రతీక సొంత ఇల్లు" అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలం, భూమి పత్రాలు ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు దశల్లో మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని వివరించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.1 లక్ష, గోడల నిర్మాణం అనంతరం రూ.1 లక్ష, స్లాబ్ పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన అనంతరం మరో రూ.1 లక్ష నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఈ సహాయం గ్రీన్ చానల్ ద్వారా పారదర్శకంగా అందజేయబడుతుందని స్పష్టం చేశారు. ఇల్లు నిర్మాణం జరుగుతున్న సమయంలో తప్పకుండా ఒకసారి ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వచ్చి పరిశీలిస్తానని, ఒక కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎవరికైనా బ్యాంకు ఖాతాలు లేకపోతే తన సొంత ఖర్చుతో ఖాతాలు తెరవించేందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ఇండ్లు కట్టుకొని లేని స్థితిలో ఉన్నవారి ఆస్ట్రానిక్ కంపెనీ ద్వారా ఇండ్లు కట్టిస్తా ఎవరు అధైర్య పడ్డదు లబ్ధిదారులు అందరూ ఇండ్లు నిర్మాణం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఎవరి ఒక్క నయా పైసా ఇవ్వకూడదని ఎవరైనా అడిగిన నా దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ఇండ్లు నిర్మించుకోలేని ఆర్థిక స్థితిలో ఉన్న లబ్ధిదారులకు ఆస్ట్రానిక్ కంపెనీ ద్వారా ఇండ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరూ అధైర్యపడవద్దని, అర్హులైన లబ్ధిదారులందరూ తమ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రక్రియలో ఎవరికి కూడా ఒక్క నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తూ, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే నాగరాజు కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ సొంతింటి కలను నిజం చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యూకో బ్యాంక్ లాభం 801 కోట్లు





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 తరంగాలు :**
ప్రభుత్వరంగ సంస్థ యూకో బ్యాంక్ ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.801 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.653 కోట్ల లాభంతో పోలిస్తే 22.66 శాతం వృద్ధిని కనబరిచింది. లాభాల్లో భారీ వృద్ధిని కనబరిచిన బ్యాంక్ ఆదాయం మాత్రం రూ.8,137 కోట్ల నుంచి రూ.7,365 కోట్లకు తగ్గినట్టు పేర్కొంది. దీంట్లో వడ్డీల మీద వచ్చే ఆదాయం రూ.6,656 కోట్లుగా ఉన్నది. మరోవైపు, ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా సమావేశమైన బ్యాంక్ బోర్డు రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకూ 44 పైసలు లేదా 4.40 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. సమీక్షకాలంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.69 శాతం నుంచి 2.17 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ 0.5 శాతం నుంచి 0.27 శాతానికి దిగొచ్చింది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో క్యూఐపీ, ఎఫ్‌పీవోతోపాటు ఇతర రూట్లలో రూ.2,700 కోట్ల నిధులను సేకరించడానికి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మార్చి చివరినాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ.5,90,314 కోట్లుగా నమోదైంది. ప్రస్తుతం బ్యాంక్ దేశవ్యాప్తంగా 3,412 శాఖలను నిర్వహిస్తున్నది.

## హైదరాబాద్‌లో అమెజాన్ క్విక్ సేవలు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 తరంగాలు :**
ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్..క్విక్ కామర్స్ సేవలను మరో 100 నగరాలకు విస్తరించింది. బుకింగ్ చేసుకున్న కస్టమర్లకు నిమిషాల్లోనే వారి వస్తువులను అందించాలనే ఉద్దేశంతో గతంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు నగరాలకు విస్తరించిన క్విక్ కామర్స్ సేవలను హైదరాబాద్‌తోపాటు కొచ్చి, అమృత్‌సర్, మంగళూరు, వైజాగ్, లక్నో వంటి నగరాల్లో నిమిషాల్లోనే వేగవంతంగా డెలివరీ చేయడానికి ఈ సేవలను ప్రారంభించినట్టు ప్రకటించింది. ఇందుకోసం ఆయా నగరాల్లో వెయ్యికి పైగా చిన్న స్థాయి గిడ్డంగులను సైతం నెలకొల్పింది. ప్రధానంగా నిత్యావసర వస్తువులతోపాటు మరిన్ని ఉత్పత్తులను సైతం నిమిషాల్లోనే డెలివరీ చేయనుండగా, మరొక 40 లక్షల ఉత్పత్తులను మాత్రం బుకింగ్ చేసుకున్న మరుసటి రోజు చేయనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దీంతో బుకింగ్ చేసుకున్న వస్తువుకోసం రోజుల తరపడి వేచి చూడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ నూతన సేవల కోసం సంస్థ రూ.2,800 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది.

## కదంతొక్కిన సూచీలు.. సెన్సెక్స్ 639, నిఫ్టీ 195 పాయింట్ల లాభం



**ముంబై, ఏప్రిల్ 27 తరంగాలు :**
దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనాలకు బ్రేక్ పడింది. బ్లూచిప్ సంస్థలైన రిలయన్స్, సన్‌ఫార్మా షేర్లకు మదుపర్ల నుంచి లభించిన మద్దతుతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీల్లో జోష్ పెంచాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు త్వరలో తగ్గుముఖం పట్టే అవకాశాలున్నట్టు వచ్చిన వార్తలు మదుపర్లను కొనుగోలు వైపు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 639.42 పాయింట్లు లాభపడి 77,303.63 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 194.75 పాయింట్లు అందుకొని 24,092.70 వద్ద స్థిరపడింది.

### రిలయన్స్ షేరు జోరు

గత త్రైమాసికంలో నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికీ రిలయన్స్ షేరు భారీగా పుంజుకున్నది. బ్లూచిప్ సంస్థల షేర్లలో అత్యధిక విలువ కలిగిన రిలయన్స్ షేరు ఇంట్రాడేలో మూడు శాతానికి పైగా లాభపడిన షేరు చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 2.88 శాతం అందుకొని రూ.1,365.95 వద్ద ముగిసింది. అటు ఎన్ఎస్ఈ లోనూ 2.86 శాతం ఎగబాకి రూ.1,365.80 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.51,837.41 కోట్లు పెరిగి రూ.18,48,477.13 కోట్లకు చేరుకున్నది. సన్‌ఫార్మా షేరు 7 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది. అమెరికాకు చెందిన ఆర్గానన్ అండ్ కో సంస్థను కొనుగోలు చేయనున్నట్టు ప్రకటించడంతో షేరు ధర రివ్వున ఎగిసింది. అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్, టీసీఎస్, టాటా స్టీల్, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, మారుతి, ఇన్ఫోసిస్ షేర్లు ఒక్క శాతంకు పైగా బలపడ్డాయి. వీటితోపాటు ఎస్బీఐ, ఎల్‌అండ్‌టీ, ఇండిగో, టైటాన్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌యూఎల్, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు 3 శాతం వరకు నష్టపోయాయి. అన్ని రంగాల షేర్లు కదంతొక్కాయి. యుటిలిటీ రంగ షేరు అత్యధికంగా 2.50 శాతం లాభపడగా, హెల్త్‌కేర్ 2.43 శాతం, ఐటీ 2.41 శాతం, రియల్టీ 2.35 శాతం, పవర్ 2.05 శాతం, సర్వీసెస్ 1.92 శాతం చొప్పున బలపడ్డాయి.